

తాండూర్: మండలంలోని మాదారంటౌన్‌షిప్ సింగరేణి పిల్లల పార్కు గడ్డి, పిచ్చి మొక్కలతో అధ్వానంగా తయారైంది. అసలే దసరా సెలవులు ఆటలాడుదామంటే చిన్నారులకు ఆటవిడుపు అందని ద్రాక్షలా మారింది. ఇప్పటికైనా సింగరేణి అధికారులు స్పందించి పార్కు నిర్వహణను రోజూ చేపట్టి చిన్నారులకు, అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.



భీమారం: భీమారం–ఆరెపల్లి ప్రధాన రోడ్డులోని వివిధ ప్రాంతాల్లో చెట్లు రోడ్డుని ఆక్రమిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. రోడ్డుపై ఎదురుగా మరోవాహనం వస్తే సైడ్ ఇచ్చే పరిస్థితి లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. అధికారులు చర్యలు చేపట్టి రోడ్డుపైకి వస్తున్న చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



చెన్నూర్‌రూరల్: మండలంలోని కొమ్మెర గ్రామంలో సుమారు రూ.12లక్షల నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్ర భవనాన్ని నిరుపయోగంగా వదిలేశారు. భవనం నిర్మించి ఏడాదిన్నర గడుస్తున్నా భవనం ఎందుకు ప్రారంభించడం లేదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. దీంతో పాత భవనంలోనే కేంద్రాన్ని నడిపిస్తున్నారు.

క్లుప్తంగా

నూతన కార్యవర్గం



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

చెన్నూర్: చెన్నూర్ పెన్షనర్ల సంఘం నూతన కార్యవర్గం గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. నూతన అధ్యక్షుడిగా పురాణం శంకర్, ప్రధాన కార్యదర్శిగా రాపర్తి శ్యాంసుందర్, కోశాధికారిగా కాసర్ల సురేశ్‌బాబు, అసోసియేట్ అధ్యక్షుడిగా రామడుగు రామన్న, ఉపాధ్యక్షుడిగా రత్న బాస్కర్‌రెడ్డి, పద్మనాభ చారి, సంయుక్త కార్యదర్శిగా వి.మనోహర్ రావు, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా కె.రామయ్య, మామిడి బాపు, సత్యనారాయణ, గౌరవ అధ్యక్షులుగా మహవాది సుధాకర్‌రావులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీనియర్ పెన్షనర్లు పాల్గొన్నారు.

ఘనంగా ఫ్రెషర్స్ డే



విద్యార్థుల ప్రదర్శన

మంచిర్యాలఅర్బన్: మంచిర్యాల వొకేషనల్ (వృత్తి విద్య) కళాశాలలో గురువారం ఫ్రెషర్స్ డే ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఆటపాటలతో అలరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీదేవి, డైరెక్టర్లు మహాలక్ష్మి, ఆదిత్య బాబు, సాయికృష్ణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు కళాశాలల్లో సమావేశం

మంచిర్యాలఅర్బన్: జిల్లాలోని అన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఈ నెల 26న విద్యార్థుల తల్లిదండ్రులు, అధ్యాపకులు సమావేశం నిర్వహించాలని డీఐఈవో అంజయ్య సూచించారు. విద్యార్థుల ప్రగతి, హాజరు తదితర విషయాలు చర్చించిన అనంతరం కళాశాల అభివృద్ధి గురించి తల్లిదండ్రుల సలహాలు, సూచనలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా జరగనున్న సమావేశానికి తమ తమ కళాశాలల్లో విద్యార్థులతో సహా తల్లిదండ్రులు హాజరయ్యేలా చూడాలని కళాశాలల ప్రిన్సిపాళ్లకు సూచించారు.

నేడు, రేపు మహనీయుల జయంతి వేడుకలు

మంచిర్యాలటౌన్: జిల్లా కేంద్రంలోని సమీకృత కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ఈ నెల 26న ఉదయం 9:30గంటలకు చాకలి ఐలమ్మ జయంతి వేడుకలు, 27న ఉదయం 9:30గంటలకు ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సంఘాల నాయకులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

వరిపంటల సందర్శన



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

భీమారం: వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'గ్రామగ్రామాన నాణ్యమైన విత్తనం' కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని మద్దికల్ గ్రామ శివారులో రైతులు పండిస్తున్న వరి పంటలను గురువారం చెన్నూర్ ఏడీఏ బానోత్‌ప్రసాద్ సందర్శించారు. వరిలోని బెరుకులు తీసి నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలని రైతులను కోరారు. నాణ్యమైన విత్తనాలను తయారు చేసే పద్ధతులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సుధాకర్, రైతులు పాల్గొన్నారు.

స్నేహమంటే ఇదేరా!



రాజన్నతో మల్లిఖార్జున్

దండేపల్లి: నిరుపేద కుటుంబానికి చెందిన స్నేహితుడి ఇంటి నిర్మాణానికి మిత్రులంతా కలిసి ఆర్థిక సాయం అందించి స్నేహమంటే ఇలా ఉండాలని నిరూపించారు. దండేపల్లి మండలం మాదాపూర్‌కు చెందిన దూమల్ల రాజన్న నిరుపేద. అతడికి ఉండేందుకు ఇల్లు లేదు. దీంతో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. అయితే ఇంటి నిర్మాణానికి అతడితో దండేపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో కలిసి చదువుకున్న నలుమాసు మల్లిఖార్జున్, అతడి స్నేహితులంతా కలిసి రూ.1.5లక్షను గురువారం అందించారు. ప్రభుత్వం ఇచ్చే డబ్బులకు తోడుగా తాము ఈ నగదును అందించినట్లు స్నేహితులు తెలిపారు.

నివేదికలకే పరిమితం!

- జన్నారం మండలంలో 1,400ఎకరాల్లో పంట నష్టం
- రైతులకు అందని పరిహారం
- ప్రభుత్వం నుంచి ప్రకటన రాకపోవడంతో ఆందోళన

అకాల వర్షాలు అన్నదాతను అతలాకుతలం చేశాయి. ఇటీవల నిత్యం కురుస్తున్న వర్షాలకు అన్నదాతకు కోలుకోలేని దెబ్బ తగిలింది. గోదావరి తీర పరివాహక గ్రామాల రైతులకు తీరని నష్టం వాటిల్లింది. వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి పంట నష్టం అంచనా వేసి నివేదికలను పంపినా, ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రకటన రాకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఈ చిత్రంలో ఉన్న రైతు పేరు గడ్డి విష్ణుమూర్తి. ఈయనది కలమడుగు గ్రామం. గోదావరి తీరప్రాంతంలో ఈ రైతుకు నాలుగు ఎకరాల పత్తి చేను, 11ఎకరాల్లో పామాయిల్ తోట ఉంది. గోదావరి వరద పత్తి చేలు, పామాయిల్ తోట నుంచి ప్రవహించగా ఎకరన్నర పత్తి చేను, పామాయిల్ తోట పూర్తిగా నీటిలో మునిగిపోయింది. ఫలితంగా పత్తి పనికి రాకుండా పోయింది. చేతికొచ్చిన పత్తి మురిగిపోవడంతో పెట్టిన పెట్టుబడి నష్టపోవాల్సి వచ్చిందని ఆయన పేర్కొంటున్నాడు. పామాయిల్ చెట్లు కొన్ని కొట్టుకుపోయాయి. వ్యవసాయ అధికారులు వచ్చి నష్టం అంచనా వేశారు. కానీ ఇప్పటి వరకు పరిహారం గురించి చెప్పడం లేదు.



వరి పంటలో చేరిన ఇసుక

జన్నారం: మండలంలోని కలమడుగు, ధర్మారం, బాదంపల్లి, తిమ్మాపూర్, రాంపూర్, చింతగూడ, తపాలపూర్ గ్రామాలు గోదావరి తీర గ్రామాలు. ఈ గ్రామాల్లోని రైతులకు అత్యధికంగా గోదావరి నదిని ఆనుకొని పంట పొలాలు, పత్తి చేనులు ఉన్నాయి. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో కురుస్తున్న వర్షాలకు కడెం, శ్రీరాంసాగర్ ప్రాజెక్టుల నుంచి వరదనీటిని గోదవరిలోకి వదలడంతో గోదావరి ఉధృత రూపం దాల్చింది. ఫలితంగా ఆయా గ్రామాల్లో గోదావరి పంట పొలాలు, చేల నుంచి ప్రవహించింది. దీంతో పొలాలు, పత్తి చేలు పనికి రాకుండా పోయాయి. రైతుల పెట్టుబడి ఖర్చు, వేసిన మందులు నీళ్లపాలయ్యాయి.

పంట నష్టంపై అంచనా..

వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాల్లో సర్వేలు చేశారు. నష్టంపై అంచనా వేశారు. మండలంలో 480మంది రైతులకు సంబంధించిన 972ఎకరాల్లో వరి పంట, 391ఎకరాల్లో పత్తి పంట, 40ఎకరాల్లో మొక్కజొన్న పంట నష్టం జరిగినట్లు వ్యవసాయాధికారులు తెలిపారు. అయితే వ్యవసాయ శాఖ అధికారులు పంటనష్టం అంచనా వేసినా, పరిహారం అందడం లేదని రైతులు ఎదురుచూస్తున్నారు.

పరిహారం అందించాలి



నేను నాలుగు ఎకరాల్లో వరి పంట వేశాను. ఇటీవల వర్షాలకు గోదావరి ప్రవహించడంతో రెండు ఎకరాల్లో పంట నష్టం జరిగింది. అధికారులు వచ్చి సర్వే చేసి రాసుకున్నారు. ప్రభుత్వం పరిహారం అందిస్తుందనే ధీమాతో ఉన్నాను. అధికారులు ఈ విషయంలో దృష్టి పెట్టి రైతులను ఆదుకోవాలి.

- జక్కుల గౌరయ్య, కలమడుగు

నాలుగు ఎకరాలు నష్టపోయా..



నేను నాలుగు ఎకరాల్లో వరి, నాలుగు ఎకరాల్లో పత్తి వేశాను. పంట బాగా వచ్చిన సమయంలో అధిక వర్షాలకు గోదావరి ఉప్పొంగి, నా పంట పొలాల నుంచి ఉధృతంగా ప్రవహించింది. పంటపైన బురద వేసింది. ఫలితంగా సగం పంట నష్టపోయాను. వ్యవసాయ అధికారులు సర్వే చేశారు. పరిహారం అందేలా చూడాలి.

- దాసరి వెంకటేశ్, యువరైతు తిమ్మాపూర్

పరిహారం అందుతుంది



ఆగస్టు, సెప్టెంబర్ మాసాల్లో అధిక వర్షాల కారణంగా ప్రాజెక్టుల నీటిని గోదావరికి వదలడంతో గోదావరి తీర ప్రాంతాల్లోని రైతుల పొలాల్లో వరద చేరింది. ఫలితంగా పంట నష్టం జరిగింది. నష్టం వివరాలను సర్వే ద్వారా సేకరించి, నివేదికలను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి రాగానే పరిహారం అందజేస్తాం.

- సంగీత, ఏవో, జన్నారం

అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు

- డీఆర్డీవో కిషన్



సిబ్బందితో ప్రతిజ్ఞ చేయిస్తున్న డీఆర్డీవో కిషన్

లక్సెట్టిపేట: ఉపాధిహామీ పథకంలో సిబ్బంది అక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని డీఆర్డీవో కిషన్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో గురువారం సామాజిక తనిఖీ సమావేశంలో ఆయన మాట్లాడారు. కూలీలకు ఉపాధి కల్పించి వేతనాలు సక్రమంగా చెల్లించాలన్నారు. ఈ నెల 17 నుంచి 23వ తేదీ వరకు మండలంలోని 18 గ్రామ పంచాయతీల్లో సోషల్ ఆడిట్ సిబ్బంది గ్రామాల్లో తనిఖీలు నిర్వహించారన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.3075కోట్లతో చేపట్టిన ఉపాధిహామీ పనులను పరిశీలించి నివేదికలు అందించారన్నారు. కొన్ని ప్రొసీజర్స్ లోపం వల్ల సిబ్బంది నుంచి రూ.5839 రికవరీ చేస్తున్నట్లు తెలిపారు. ఉపాధిహామీ పనులను పారదర్శకంగా నిర్వహించాలని కూలీలకు ఎలాంటి ఇబ్బందులు కల్గించొద్దని సూచించారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, అసిస్టెంట్ విజిలెన్స్ అధికారి కిరణ్, సోషల్ ఆడిట్ సిబ్బంది వేణు, ఏపీవో వేణుగోపాల్, ఎస్‌ఆర్పీ సాయిలు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం ఈజీఎస్ అధికారులు, ఎంపీడీవో, సిబ్బందితో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. సిబ్బందితో ప్రతిజ్ఞ చేపించారు. ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో చెత్తకుప్పలను తొలగించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరోజ, సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, పారిశుద్ధ్య కార్యక్రమాలపై సమీక్ష



అధికారులతో మాట్లాడుతున్న డీపీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): పల్లెల్లో తీసుకోవాల్సిన పారిశుద్ధ్య కార్యక్రమాలతో పాటు అభివృద్ధి కార్యక్రమాలపై గురువారం ఐడీఓసీ కార్యాలయంలో డీఎల్‌పీవో, ఎంపీవోలతో డీపీవో వెంకటేశ్వర్‌రావు సమీక్ష నిర్వహించారు. క్షేత్రస్థాయిలో అధికారుల తనిఖీలు, పంచాయతీ కార్యదర్శుల హాజరు, పారిసేవలు, 15వ ఆర్థిక సంఘం ద్వారా విడుదలైన నిధుల వినియోగం, ఆడిట్, పంచాయతీల్లో చేపడుతున్న పారిశుద్ధ్య పనులపై చర్చించారు. పంచాయతీల్లో నిర్మిస్తున్న భవన నిర్మాణాల పూర్తికి దృష్టి సారించాలన్నారు. డివిజినల్, మండల పంచాయతీ అధికారులు, జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న రాజన్న

దండేపల్లి: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జాడి రాజన్న డిమాండ్ చేశారు. దండేపల్లిలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాల్లో అనుసరిస్తున్న రిజర్వేషన్ పదోన్నతుల్లో కూడా వర్తింప జేయాలన్నారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయులందరికీ పెండింగ్ బకాయిలు వెంటనే చెల్లించాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రకాశ్‌నాయక్, కార్యదర్శి భుక్య రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మలతో నర్సులు, సిబ్బంది



శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో...



మందమర్రి జీఎం కార్యాలయ ఆవరణలో...



మంచిర్యాలఅర్బన్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థినులు



రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో...



బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో...

మంచిర్యాలఅర్బన్/మందమర్రిరూరల్/శ్రీరాంపూర్/మంచిర్యాలటౌన్: బతుకమ్మ సంబురాలు కొనసాగుతున్నాయి. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో, జిల్లా రెడ్డి ఉమెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, శ్రీహర్ష జూనియర్ కళాశాలలో, మందమర్రి ఏరియా జీఎం ఆఫీస్ ఆవరణలో, శ్రీరాంపూర్ జీఎం కార్యాలయ ఆవరణలో గురువారం బతుకమ్మ వేడుకలు నిర్వహించారు. తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. బంగారు బతుకమ్మ ఉయ్యాలో అంటూ ఆటపాటల్లో మునిగితేలారు. గనులపై జీఎంలు, ఆసుపత్రిలో వైద్యులు, కళాశాలలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

● పిచ్చి మొక్కలు, చెత్త తొలగింపు

దండేపల్లి: స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా దండేపల్లి ఐకేపీ కార్యాలయ సమీపంలో కాలనీవాసులు గురువారం శ్రమదాన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు పక్కన ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి, పరిసరాలు శుభ్రం చేశారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలతరెడ్డి, మాజీ ఎంపీటీసీ ముత్యాల శ్రీనివాస్, కాలనీ వాసులు పాల్గొన్నారు.

● ఘనంగా చండీయాగం

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ ఏరియాలోని ఆర్కే 7గనిలో దుర్గానవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. గురువారం అమ్మవారి ఆలయం వద్ద చండీయాగం నిర్వహించారు. అమ్మవారు కాత్యాయనీ రూపంలో దర్శనమిచ్చింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రీరాంపూర్ జీఎం శ్రీనివాస్ దంపతులు హాజరై పూజల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో గని మేనేజర్ తిరుపతి, గుర్తింపు సంఘం ఏఐటీయూసీ బ్రాంచీ ఉపాధ్యక్షుడు కొట్టె కిషన్ రావు, గని రక్షణాధికారి సంతోశ్, ఫిట్ సెక్రెటరీ మారుపల్లి సారయ్యలు పాల్గొన్నారు.

● ఘనంగా దీన్ దయాళ్ జయంతి

మందమర్రిరూరల్(రామకృష్ణాపూర్): రామకృష్ణాపూర్ పట్టణంలోని సూపర్‌బజార్ కూడలి వద్ద దీన్ దయాళ్ జయంతిని బీజేపీ నాయకులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆరుముల్ల పోషం, ఠాకూర్ ధన్‌సింగ్, బంగారి వేణు తదితరులు ఉన్నారు.

● అలరించిన సంగీతావిభావరి

మంచిర్యాలఅర్బన్: స్థానిక ప్రైవేట్ పంక్షన్‌హాల్లో జిల్లా కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం వర్ధంతి సందర్భంగా నిర్వహించిన సంగీత విభావరి అలరించింది. ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కళాకారుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు సిరికొండ బోసు, వివిధ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

● 'ఏఎన్‌ఎంలపై అధిక భారం'

పాతమంచిర్యాల: ప్రభుత్వం ఏఎన్‌ఎంలపై అధిక భారం మోపుతుందని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు దుంపల రంజిత్ అన్నారు. చార్వక ట్రస్ట్ భవన్‌లో గురువారం సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలన్నారు. సెకండ్ ఏఎన్‌ఎంల పరీక్ష ఫలితాలు ప్రకటించి, వారికి పోస్టింగులు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ ఎం.పద్మ, ధనలక్ష్మి, పుష్ప, మమత రాణి, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

● నిండుకుండలా అన్నారం బ్యారేజీ

చెన్నూర్‌రూరల్: కురుస్తున్న భారీ వర్షాలతో పాటు ఎల్లంపల్లి ప్రాజెక్టు గేట్లు తెరవడంతో మండలంలోని సుందరసాల గ్రామ సమీపంలోని అన్నారం (సరస్వతి) బ్యారేజీ నిండుకుండలా మారింది. చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు గురువారం బ్యారేజీని పరిశీలించారు. వరద ఉధృతి ఎక్కువగా ఉన్నందునా ముంపు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

● ఉత్సాహంగా గజ్జె పూజోత్సవం

నస్పూర్: పట్టణ పరిధిలోని నాగార్జునా కాలనీ శివాలయం ఆవరణలో గజ్జెపూజోత్సవం ఉత్సాహంగా నిర్వహించారు. శ్రీ శార్వాణి నృత్యాలయం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన ఈ పూజో త్సవంలో నృత్యం నేర్చుకుంటున్న విద్యార్థుల కాళ్లకు మొదటి సారిగా గజ్జెలు కట్టి నృత్యం చేయించారు.

కాత్యాయనిగా దుర్గామాత



చెన్నూర్/మంచిర్యాలఅర్బన్: దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా గురువారం దుర్గామాత కాత్యాయనిగా దర్శనమిచ్చారు. రాళ్లపేట్‌రోడ్ నంబర్–1 శివపంచాయితన ఆలయం మణికంఠ గణేశ్ మండలి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని గాజులతో అలంకరించారు. చెన్నూర్ పట్టణంలోని మంజూనాథ దుర్గాదేవి మండపంలో దేవీ దీక్షాపరులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.

యూరియా కోసం అరిగోస



చెన్నూర్‌రూరల్: యూరియా బస్తాల కోసం రైతులు అరిగోస పడుతున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయడం లేదు. మండలంలోని సుందరసాల గ్రామానికి గురువారం 266యూరియా బస్తాలు వచ్చాయి. ఒక్కో రైతుకు ఒక్కో యూరియా బస్తా పంపిణీ చేయగా, కొందరు గొడుగులతో, మరికొందరు వర్షంలో తడుస్తూనే క్యూలైన్లో నిల్చొని పడిగాపులు గాసారు.

ముసురుకున్న వాన

- తగ్గని గోదావరి వరద ఉధృతి



బెల్లంపల్లి: పత్తి చేనులో నిలిచిన నీరు

వేమనపల్లి/చెన్నూర్/దండేపల్లి/జైపూర్: రెండు రోజులుగా ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తూనే ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు గురువారం గోదావరి నదికి వరద నీరు పోటెత్తింది. తీరప్రాంతాల్లోని పంట పొలాలు నీట మునిగాయి. గోదావరి నది బ్యాక్‌వాటర్‌తో జైపూర్ మండలంలోని వేలాల, పొనూర్, గోపాల్‌పూర్, శివ్వారం, కిష్టాపూర్ గ్రామాల్లో పంటలు మొత్తం జలమయమయ్యాయి. తహసీల్దార్ వనజారెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ, వేలాల ప్రత్యేకాధికారి విద్యాసాగర్ రావు, ఇతర అధికారులు గ్రామాలను సందర్శించి ప్రజలను అప్రమత్తం చేశారు. గోదావరిలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో ప్రజలు అటువైపుగా ఎవరూ వెళ్లొద్దని భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. వేమనపల్లి నీల్వాయి వాగులో వరద ఎక్కువై ప్రాజెక్టు మత్తడి గుండా ఎత్తిపోస్తుంది. చామనపల్లి వాగు ఉధృతంగా ప్రవహించటంతో రాకపోకలు స్తంభించాయి. చెన్నూర్ మారెమ్మవాడకు చెందిన భీంమధు అనే వ్యక్తి ఇంటి గోడ కూలిపోయింది. కూలిన గోడ పక్కనే కుటుంబ సభ్యులు పడుకొని ఉన్నారు. పెను ప్రమాదం తప్పింది.

ఎంబీబీఎస్‌లో సీటు

జన్నారం: మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన కొమ్ము మల్లేష్–సరోజనల కుమారుడు మనోజ్‌కు ఎంబీబీఎస్‌లో సీటు లభించింది. నిరుపేద వ్యవసాయ కుటుంబానికి చెందిన మనోజ్ ప్రాథమిక విద్యను రాంపూర్‌లో, ఉన్నత విద్యను కరీంనగర్‌లో పూర్తి చేశాడు.